# పరాధీన

[కథానిక]

— శ్రీ వేలూరి సహజానందం —

"ప్రభూ... ఈ జీవికి మరణశిక్షేనా ?" పార్వతి చూపులు, ఈ సూటిప్రశ్నలు ప్రభుమనోదుర్గపు కోటగోడలు కూలిపోయినయ్. నిండువెన్నెల్లో పార్వతి చెక్కిళ్ళపై కన్నీళ్ళు మెరుస్తున్నయ్. ఆమె ముఖంలో రోగి మరణయాతనచ్ఛాయలు కమ్ముకుతున్నయ్. ప్రభుగుండె జలదరించింది. నిశ్శబ్దమైన నిశీథంలో పార్వతి అంతర్యం అతని ముందు ఉజ్వలంగా నిలబడి విజృంభిస్తోంది. అత నేదో మాట్లాడబోయాడు. కాని పార్వతి అతని పెదవులను చేతితో నొక్కింది. ఆ హస్తస్పర్శలో స్త్రీహృద్ఘోష ప్రభురక్తనాళాల్లో ప్రతిధ్వనించింది.

"పార్వతీ! నాలుగురోజుల్లో నేను పెళ్ళిచేసుకుంటున్నాను. నువ్వు సంతోషంగా వన్నా..." ప్రభు ఇక మాట్లాడలేకపోయాడు.

ప్రభుసమాధానం పార్వతిహృదయాన్ని కలచివేసింది. ఆకాశంలో చంద్రుడు, ఇక్కడ ఈ జీవద్వయం జాగరణతో రాత్రిని గడుపుతున్నారు.

"రెండేళ్ళక్రితం నా సంతోషం, సుఖం ఏమైనయ్ ప్రభూ ?" అని పార్వతి తన ముఖాన్ని అతని పాదాలపై ఆన్చింది.

ప్రభుపాదాలపై పార్వతిజుట్టు నల్లనిమబ్బులా కమ్ముకుంది. పరాయి ఇంట్లో . ఇల్లాలుతో... ఏకాంత అర్ధరాత్రి... ఇలా వాంఛాఝంఝూటంలో చిక్కుకుపోయిన ప్రభు తన పాదాక్రాంతయై యున్న పార్వతిని చూచి దుఃఖంతో వివశుడయాడు.

కష్టాల్లో ఉన్న సోదరి తన కాళ్ళపై బడి, సాయంకోసం యాచిస్తున్నట్టుగా ఉంది అతనికి. అంతేకాదు, పార్వతిహృదయం ఆక్రోశంతో, పరాభవంతో భగ్గుమంటోందనీ, దానిప్రజ్వలనంలో తమిద్దరి భవిష్యత్తూ భస్మీపటలం కాగలదనీ ప్రభు ఊహించాడు.

"పార్వతీ... ఇన్నాళ్ళనుంచీ నే కోరుతోం దేమిటి ? నీ సుఖం కాదూ ? నీ పెళ్ళినాడు చెప్పాను. "నీ ఆరాధ్యదైవం నీకు లభించింది. ఇక అతనికే నీ పూజ పూవత్తూ" అని. ప్రభు పార్వతిముఖాన్ని తన చేతులలోకి తీసుకుని వెన్నెలలోకి పైకెత్తాడు.

పార్వతి ఈ శుష్కసమాధానానికి చలించలేదు.

"ఈ పరామర్శతో పొద్దుపుచ్చకు... సుఖం ? రెండేళ్ళక్రితం నీ పార్వతి మరణించింది. దాని జీర్ణ, త్యక్తకళేబరాన్ని చితిదాకా మోసుకొని వెళ్ళటమే నా సుఖం !" పార్వతి సత్తువ తెచ్చుకుని కూర్చొంది.

ఈ రెండేళ్ళూ ఆమె భర్తృగృహంలో ప్రశాంతంగా ఉంటోంది. లోని గాయం ఎంత పోటుపెట్టుతున్నా, ఆ బాధ నణచుకొని దాంపత్యధర్మం నెరవేరుస్తోంది. ఉపచారంలో, సహకారంలో, మంచితనంలో రవ్వంత లోటులేని భార్యలో తన గ్రహణ కందకుండా ఏదో తీవ్రవేదన వేయిపడగలెత్తి బుసకొట్టుతోందని శివరావుకు తెలుసు. చిన్ననాటి చెలికాడైన ప్రభుకు కాకుండా ఇతరునికి తాను భార్యకావటంతో పార్వతి జీవచ్ఛవంలా రాత్రింబవళ్లు గడుపుతోంది. ఈ రెండేళ్ళూ ప్రభు తనకు కన్పించలేదు.

అతను తాగుబోతై ఉంటాడనీ, కుష్కించి ఉంటాడనీ కొన్నాళ్ళనుంచి పార్వతి భయపడుతోంది. శివరావీమధ్య ప్రభును ఒకసారి ఇక్కడికి పిలుద్దామా అని అంటేకూడా, 'అతను దుర్మార్గుడు, తాగుబోతు' అని ప్రభుగురించి వ్యాఖ్యానించి మళ్ళీ ఇన్నాళ్లకు తాగుబోతూ, దుర్మార్గుడూ కాని ప్రభు అనుకోకుండా ఇలా వచ్చినప్పుడు, పార్వతి ఆనందవిచారాలతో క్షోభపడుతోంది.

పార్వతి కష్టంగా జరిగి ప్రభు అన్నాడు:

"రెండేళ్లకిందటి గాథతో నీకు నువ్వు ఉరిపోసుకుంటున్నావు!"

చకితురాలైన పార్వతిముఖం ఒక్కసారిగా ఉత్తేజితమై, ఇలా అంది:

"ప్రభూ! రెండేళ్ళకితం నువ్విలా మాట్లాడేవాడివా? పరాధీన అయిన పార్వతి నీ కిప్పుడు అపరిచయురాలు. ఈ రెండేళ్లూ నా కజ్ఞాతంగా ఉన్న నీ హృదయం విచారంతో మగ్గిపోవుల్లేమా...ప్రభూ! నీ శక్తిసాహసాలేవీ? మనకు ప్రపంచంలో చోటు లేదా? చివరికే రుద్రభూమిలోనో ఏదో వటవృక్షంకింద మనం తలదాచుకోలేమా?"

"పార్వతీ!"

"అప్పటికీ వెలుగు మనకు వెన్నంటి, నిశీథనేపథ్యాలనుంచి వెలికీడిస్తే, అగ్నిదేవుని స్వాగతమెప్పుడూ మనకు ఉన్నదేగదా? ప్రభూ...మరణంలేని యాజ్ఞసేనికైదీని నేను..."

"పార్వతీ...నీకు మతిపోతోంది. నీ ఇంటికి నువ్వు నిప్పంటించుకుంటున్నావు! నాలుగురోజుల్లో నా పెళ్ళి..."

"పెళ్ళి...ప్రభూ...నిజం చెప్పు...నీ కీపెళ్లి ఇష్టమేనా? నువ్వు తాగుబోతు, దుర్మార్గుడివి కాకపోయినా, స్త్రీలోలుడివై పోతున్నావు...ప్రభూ!"

ప్రభు ఆపాదమస్తకం కంపించాడు. ఇద్దరిమధ్య నూత్నవధువు నిలబడిఉంది.

"పార్వతీ! నేను కోరి చేసుకుంటున్న పెళ్లి... ఎవరి నిర్బంధమూ లేదు. నువ్వొక్క దేవతఅని చెప్పాను."

"ప్రభూ! ఇంక చాలు...పాత్రను విషంతో నింపట మిక చాలు...ప్రభూ! నువ్వు నా ప్రభువి కావు...నీ కళ్ళు నెవ్వరో పొడిచారు. వాటి రక్తాశ్రువుల ఘోష నీకు వినబడట్లేదా—ప్రభూ! రెండుసార్లు పెళ్ళిచేసుకోగలవా?"

"పార్వతీ..." ప్రభు నిశ్చేష్టుడై మాట్లాడలేకపోయాడు.

"నా ఈ వివాహం ఇంకో నెల ఉందనగా, నీ మెళ్లో నే వేసిన పూలమాల నీ మగపుబుద్ధికి వాడిపోయి ఉండవచ్చు. కాని నువ్వు...నీ చేత్తో...ప్రభూ...ఈ అభాగ్యురాలిముఖం...ఇక్కడ నువ్వుపెట్టిన కుంకుమ ఈనాటికీ ఈచర్మంకింద భగ్గున దేదీప్యమానంగా ప్రజ్వలిస్తోంది. నా కానాడే వివాహం. నా కానాడే దాంపత్యం...ఇవ్వాళ మళ్లీ నువ్వు ఇంకొకసారి పెళ్లి..." ఆవేశంతో పార్వతి ఇక మాట్లాడలేకపోయింది.

ప్రభు అశ్రువులు చూసి పార్వతి తలవంచుకుంది. తర్వాత గాద్గదికస్వరంతో పార్వతి అడిగింది.

"ప్రభూ! ఈ ఇంట్లోంచి వెళ్లిపోదామా? ఈ నాల్గురోజులూ నీతో ప్రపంచంలో తిరిగి, నీ కల్యాణ సమయానికి భస్మమైపోతాను."

తన్ను తా సంబాళించుకొని ప్రభు గంభీరంగా అన్నాడు:

"పార్వతీ...నీ పెళ్లినాడు చెప్పాను. 'శివరావు నీ భర్త అవటం నీ అదృష్టం. ఈ అదృష్టం లోకంలో అందరికీ లభించదు. ఇందుకతనికి నువ్వు వేయినమస్కారాలు పెట్టా'లని"

"ప్రభూ! నా అదృష్టం..." అని పార్వతి మళ్లీ మౌనం వహించింది.

తెల్లవారుజాము అవుతోంది. ఈ కఠోరమైన రాత్రి ఎప్పటికైనా తెల్లవారుతుందా అని అనుకుంటున్నాడు ప్రభు. పార్వతీ...తాను...ప్రచ్ఛన్నంగా ఎక్కడో యాత్ర చేయలేరా? తమ చిన్ననాటి స్నేహం తనకు తెలియకుండానే ఇలా ఆశాసౌధాలు నిర్మించుకొని, ఇవ్వాళ ఈ భూకంపంలో ఇలా బదాబదలై ఆక్రందిస్తుందని ప్రభు ఇదివరలో ఊహించలేదు.

దాంపత్యం పార్వతిని నిర్జీవురాల్ని చేసిందికాని, ఆమె హృదయాన్ని హతం చెయ్యలేకపోయింది.

తలెత్తి పార్వతి మెల్లగా అంది:

"ప్రభూ! పార్వతి పాపాత్మురాలు...దీన్ని క్షమించు. కాని నాదొక్కటే ప్రార్థన...నీ భార్యను నువ్వు ఇష్టపడి పెళ్లి చేసుకోవచ్చును. కాని ఆ చీకటి ప్రమిదలో ఏ జ్యోతి వెలుగుతోందో, అదిమటుకు నువ్వు తెలుసుకోలేవు. అయితే ప్రపంచంలో పార్వతి ఒంటరి......" అని ఇంకా పార్వతి ఏదో అనబోతుండగా, వీథితలుపు తడుక్కన కొట్టినట్లు చప్పుడయింది. ప్రభు మెల్లగా అన్నాడు. "శివ...రావు".

ప్రభుగుండె దడదడ కొట్టుకుంది. పార్వతి నెత్తిపై ఏదో ప్రళయం ముంచుకొచ్చిపడుతోందని, ఆ తలుపుచప్పుడు రాబోయేతుపానుపిడుగని అతను కంపించిపోయాడు. పార్వతి చలించలేదు. లేవనున్న ప్రభు చేతులు పట్టుకొని కూర్చోపెట్టింది.

కింద నౌకరు తలుపులు తీశాడు. మెట్లపై అడుగుల అలికిడి అయినట్టు ప్రభు ఉలిక్కిపడ్డాడు. కింద గదిలో దీపం ఒకసారి వెలిగి, మళ్ళీ కాసేపటికి ఆరింది ఇంట్లో నిశ్శబ్దంగా ఉంది.

పార్వతి లేచి నిలబడింది. ఆమెను కిందకు దిగబెట్టబోయాడు ప్రభు. కాని పార్వతి మెల్లగా అంది: "పార్వతిది ఈ ఇల్లు. ఈ ఇంట్లో నాకేమీ భయం లేదు."అని. తప్తహృదయంతో ప్రభు వచ్చి పడుకొని నక్షత్రాలకేసి చూస్తున్నాడు.

గదితలుపు ఘడియపడ్డది. తెల్లవారేముందు మెలకువ వచ్చి, శివరావు లేచి చూచాడు. కింద చాపపై కట్టెలా పడివుంది పార్వతి. ప్రభు, పార్వతులిద్దరూ స్వేచ్ఛగా మాట్లాడుకునేందుకై పనినెపంమీద వెళ్ళిన శివరావు పార్వతివిచారముఖం చూసి లోలోన బాధపడ్డాడు. భర్తఅడుగుల అలికిడికి ఉలిక్కిపడి పార్వతి లేచింది. ప్రభు మెట్లమీదనుంచి దిగివస్తున్నాడు. శివరావు తలుపులు తెరిచి, ప్రభును లోపలికి పిలిచాడు. పార్వతి విషణ్ణముఖంతో ఇంట్లోకి వెళ్ళిపోయింది.

రాత్రిరైలుకు ప్రయాణం. ప్రభు ఎంత బతిమాలినా పార్వతి బయలుదేరలేదు. అసలిప్పుడు పార్వతి జ్వరంతో మసిలిపోతోందని ఎవరికీ తెలియదు. వీథి ద్వారంవద్ద కారుహారన్ చప్పుడయింది. ప్రభు, శివరావులిద్దరూ కారులో కూర్చున్నారు. జ్వరతీవ్రతతో తూలుతూ పార్వతి డాబాపైకి పోయి పిట్టగోడ కానుకొని వీథిలోకి చూస్తోంది. కారు బయల్దేరింది. బయల్దేరిన కారులోంచి ప్రభు నమస్కరించాడు. పెద్ద చప్పుడుతో కారు వీథిమలుపు తిరిగింది.

పార్వతిగుండె బరువెక్కింది. చిన్ననాటి చెలికాడు ప్రభు, భర్త శివరావు ఇద్దరూ కులాసాగా వెళ్లిపోయారు. తాను తన నీడలో నిలబడి శూన్యంలోకి చూసింది.

తానొక ఏకాకిరై, ఓ అరణ్యంలో దారితప్పి ఉంటే, ఏ సింహపు ఆకలో తన క్షుభితజీవితాన్ని కళేబరాన్ని చేసివైచేది. ఈ ఇంట్లో...తన ఇంట్లో... తానీ ఏకాంతంలో ఇలా దహించిపోవట మెంత కాలం? గడచిన రెండు రోజులనుంచి కోలాహలంగా ఉన్న సముద్రతీరం ఇప్పుడు గభీరనిశ్శబ్దంతో భయంకరంగా ఉంది. పడవలన్నీ తెరచాప లెత్తుకొని, నీటిబాటల్లో దూసుకుపోతున్నయ్. నిర్జనంగా ఉన్న ఈ ఇసుకతిప్పల్లో కూలబడివున్న అభాగిని చెవుల్లో తరంగఘోష భీకరంగా వినబడుతోంది. ఎవ్వడో సరంగు తీరంపై కాలుపెట్టి ఈ భగ్న పాంథికుణ్ణి ఓ దోనెలో కూర్చోపెట్టి జలగహ్వరంలోకి పంపుతాడు.

దూరాన కాసేపటికి రైలుకూత వినబడ్డది. ధూమఫూత్కారంలో ఇనపచక్రాలు చుట్టలుచుట్టుకొన్న కొండచిలువల్లా రొప్పుతూ పరవళ్లు తొక్కుతున్నయ్. పార్వతి కళ్లలో నీళ్లు లేవు. ఆమె హృదయంలో స్పందంలేదు.

ఎందరో శ్మశానంలో దగ్ధమైపోతున్నారు. కాని ఇంటింటా సజీవంగా దహనమైపోతూ, భస్మంకాని ప్రాణు లెవరైనా ఉన్నారా? తానొక్కర్తేనా? ఈ హృదయతాపం ఒక్కసారి భగ్గుమని తన నెందుకు మసి చేయకూడదు? కన్నీళ్లతో ఈ ఆంతరజ్వాలాశిఖలు మరింత మంటలెగసి తన్ను దహించివేస్తున్నయ్. ఈ మరణయాతన ఎంతకాలం? ఈ జీవితంకంటె మృత్యువు సుఖంకాదా? పార్వతి కంపించింది. పార్వతి తనకు తానే ఓ మహాపర్వతమై తన్ను పాతాళంలోకి తొక్కివేస్తున్నట్టు తోచింది.

రైలుస్టేషన్నుంచి తిరిగివచ్చిన శివరావు డాబాపైకి వెళ్లి 'పార్వతీ'అని అరిచాడు. తూలిపడ్డ పార్వతి నుదుటిపై గాయంఅయి, అక్కడ నెత్తురు మరక అయింది. శివరావు హృదయం హోరెత్తుతోంది. ఆందోళనతో కళవళపడుతున్న భర్తను చూచి, "నే జీవించే ఉన్నాను" అన్నది పార్వతి నిస్పృహాలోంచి కళ్లు తెరచి.